



Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 04-11-2025 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :153 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

# చేవెళ్ల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**ఆర్టీసి బస్సును ఢీకొన్న కంకర టిప్పర్**

**ప్రమాదంలో 20మంది మృతి**

**పులువురికి తీవ్ర గాయాలు**

**క్షతగ్రానలు ఆస్పత్రికి తరలింపు**

**మృతుల సంఖ్య పెరిగే అవకాశం**



రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తాండూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సును కంకర లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 20 మంది మృతి చెందగా.. 20 మంది తీవ్రంగా గాయడ్డారు. బస్సుపై కంకర లోడు పడిపోవడంతో పలువురు ప్రయాణికులు దానికింద కూరుకుపోయారు. మృతుల్లో 10 మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. ప్రమాద సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. కంకరలో కూరుకుపోయిన వారిని బయటకు తీసారు. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. 14 మృతదేహాలకు చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. పేజి 2లో ▶

## ప్రమాదంపై చంద్రబాబు, లోకేశ్ తీవ్ర సంతాపం

రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తమను కలచివేసిందన్నారు. ప్రమాదంపై స్పందిస్తూ... మృతులకు సంతాపం ప్రకటించారు. ఈ ప్రమాదం తీవ్రంగా కలిచివేసిందని.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమం
ఎక్స్ వేదికగా సీఎం, మంత్రి తెలిపారు. 'తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికుల మృతి తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. పేజి 2లో ▶





## చేవెళ్ల రోడ్డు ప్రమాదం.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం: పొన్నం

చేవెళ్ల: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం ప్రకటించినట్లు వెల్లడించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.'ఈ బస్సు ప్రమాదంలో 19 మంది చనిపోయారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతోంది. మృతుల్లో పది మంది మహిళలు, 8 మంది పురుషులు, ఒక చిన్నారి ఉన్నారు. 19 మందిలో 13 మృతదేహాలను పోలీసులు గుర్తించారు. పేజి 2లో ▶

## ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

**తక్షణ సహాయక చర్యలకు ఆదేశం**





మిగతాది 2లో

## భారత పుత్రికలు చరిత్ర సృష్టించారు: ప్రధాని మోదీ



మిగతాది 2లో

## బస్సు ప్రమాద ఘటనపై కెసిఆర్ దిగ్భ్రాంతి



**సంతాపం ప్రకటించిన కెటిఆర్, కవిత**



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ దగ్గర ఆర్టీసీ బస్సు టిప్పర్ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 20 మంది దుర్మరణం పాలైన ఘటనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పేజి 2లో ▶

## ఎల్లయ్యగౌడ్ కుటుంబంలో తీవ్ర విషాదం

**ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రమాదంలో దుర్మరణం**



రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో అంతులేని విషాదం నింపింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు ఈ ప్రమాదంలో మృతిచెందారు. అక్కాచెల్లెళ్లు తనూష, సాయి ప్రియ, నందిని మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాలలో చదువుతున్న ముగ్గురూ.. పేజి 2లో ▶





## సమర్థ నాయకత్వం ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్: నారా లోకేశ్



ఉండవల్లి: యువతకు ఉపాధి కల్పిస్తే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని, అందుకోసం పోటీపడి పని చేస్తున్నామని చెప్పారు. ఉండవల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్ల ఏపీకి పెట్టుబడుల వెల్లువ సాధ్యమవుతోందని చెప్పారు. అనకాపల్లిలో అర్సెల్లార్ మిత్తల్ రూ.1.5 లక్షల కోట్లు, విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టబోతున్నట్లు చెప్పారు."దేశ ఎఫ్‌డీఐ చరిత్రలో అతిపెద్ద పెట్టుబడి గూగుల్ పెట్టబోతోంది. నెల్లూరులో బీపీసీఎల్ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఎన్టీపీసీ రూ.1.60 లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతోంది. స్వదేశీ పెట్టుబడుల సాధనలో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది.

పేజి 2లో

## ఏపీలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్న హిందుజా గ్రూప్!



లండన్: యూకే పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు హిందుజా గ్రూప్ ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెట్టాలని ఆ సంస్థ నిర్ణయించింది. విశాఖలో హిందుజా పవర్‌ప్లాంట్ సామర్థ్యాన్ని 1,600 మెగా వాట్లు పెంచడం, రాయలసీమ విద్యుత్ ప్లాంట్లు, మల్లవల్లిలో ఎలక్ట్రిక్ బస్సులు, తేలికపాటి వాహనాల తయారీ ప్లాంట్, ఏపీ వ్యాప్తంగా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్‌వర్క్, గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ ఎకో సిస్టమ్ అభివృద్ధికి ఆ సంస్థ దశవారీగా పెట్టుబడులు పెట్టనుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం, హిందుజా గ్రూప్ మధ్య ఒప్పందం కుదిరింది.
అంతకుముందు లండన్‌లో అతిపెద్ద విద్యుత్ సరఫరాదారు సంస్థగా గుర్తింపు పొందిన ఆక్టోపస్ ఎనర్జీ ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ క్రిస్ ఫిట్జార్డ్‌తోనూ సీఎం భేటీ అయ్యారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆ సంస్థను ఆహ్వానించారు. అమరావతి, విశాఖలో నూతన టెక్నాలజీ ద్వారా విద్యుత్ సరఫరా నియంత్రణ రంగంలో పనిచేసేందుకు అవకాశాలు ఉన్నాయని సీఎం అన్నారు. క్లీన్ ఎనర్జీ, స్మార్ట్ గ్రిడ్, డేటా అనలిటిక్స్ రంగాల్లో ఏపీలో పని చేసేందుకు అవకాశాలు ఉన్నాయని ఆక్టోపస్ ఎనర్జీ ప్రతినిధులకు వివరించారు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేలా ఏపీ లక్ష్యం పెట్టుకుందన్నారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వ పాలసీలను, ఈ రంగంలో ఏపీ నిర్దేశించుకున్న లక్ష్యాలను వారికి వివరించారు.

## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు మార్చండి.. కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్: పత్తి కొనుగోళ్లలో సీసీఐ విధించిన నిబంధనలు మార్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రాన్ని కోరారు. ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలన్న సీసీఐ కొత్త నిబంధన నేపథ్యంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తాకు లేఖ రాశారు. సాధారణంగా ఇప్పటి వరకు ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేస్తుండగా.. ఎకరాకు 11.74 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడులు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ల నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం డిక్లరేషన్ ఇచ్చిందని ఆ లేఖలో ప్రస్తావించారు.
"ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధన పత్తి రైతులకు నష్టం చేసేలా ఉంది. తేమ శాతం విషయంలో 20శాతం వరకు ఉన్నా సరే పత్తి పంట సీసీఐ కొనుగోలు చేయాలి. కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల కూడా పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. పేజి 2లో

# సంపాదకీయం

## ప్రమాణాల్లేని నేటి విమర్శ

కవి లేదా రచయిత తీసుకున్న వస్తువు అందరిచేత ఆమోదం పొందాలని భావించి రచనకు పూనుకుంటాడు. ఎక్కువమంది పాఠకులు దాన్ని ఆమోదించినప్పుడు ఆ రచన విలువ పెరుగుతుంది. ఆ విలువను ఖరారు చేయగలిగిన వాడు విమర్శకుడు. విమర్శకుడు ఒక రచనను అంచనా వేయడంలో సాహిత్య విలువలను, సామాజిక విలువలను దృష్టిలో ఉంచుకోవాలి. ఒక రచనను విమర్శ చేసే సందర్భంలో విమర్శకుడు ఏ ప్రలోభాలకు లొంగని న్యాయమూర్తి పాత్ర పోషించాలి. రచనని ఆకాశానికి ఎత్తేస్తూ వ్యాసం రాయడం విమర్శ కాదు. రచనను పాతాళానికి తోసేస్తూ మాట్లాడటమూ విమర్శ కాదు. ప్రతి రచనా ప్రభావవంతంగా ఉండాలని రచయితలు ఆశిస్తారు. కొన్ని సందర్భాల్లో రచన ప్రభావంతంగా లేనప్పుడు, రచయిత ఉన్నతిని కోరుకునే విధంగా విమర్శకుడి భాష ఉండాలి. గత పదిహేను సంవత్సరాలుగా తెలుగు విమర్శను పరిశీలించినప్పుడు సరికొత్త సిద్ధాంతాల ప్రకటనలు ఏమీ లేవని అర్థమవుతుంది. కేవలం మార్క్సిస్టు విమర్శ, ద్రవాధునికత, పోస్ట్ మోడర్నిజం ప్రాతిపదిక మీదగా మాత్రమే చాలామంది విమర్శకులు వ్యాసాలు రాస్తున్నారు. ఆ వస్తున్న వ్యాసాల్లోనూ సారం తక్కువ. ఈ కాలపు సాహిత్య విమర్శలో కేవలం విశ్లేషణ మాత్రమే మనం చూస్తున్నాం. మరి కొంతమంది కేవలం లోపాలు చెప్పడం మాత్రం విమర్శ అనే భ్రమలో ఉన్నారు. ఏదైనా ఒక విమర్శను చేసినప్పుడు అందులో విమర్శకుడు తన పరికరాలు ఏమిటో, నిరూపణలు ఏమిటో చెప్పాలి. సాహిత్య విమర్శలలో వివరణలు ఉండవచ్చు. విశ్లేషణ ఉండవచ్చు. వివేచన ఉంటుంది. సమన్వయం ఉంటుంది. మూల్యాంకనము ఉంటుంది. ఇట్లాంటి లక్షణాలు కలిగిన విమర్శకులు రావాలి. సాహిత్య వికాసంలో విమర్శ ఒక భాగం. ఒక కవిత సంపుటిని లేదా కవిత్వాన్ని విలువ కట్టడానికి ఇవాళ విమర్శకులు కొత్త ప్రమాణాలను రూపొందించినట్లు కనబడదు.

కేవలం వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం ఈ నాలుగు మాటలతో వ్యాసం రాస్తే అది విమర్శ అని సాహిత్య లోకంలో ఇప్పుడు చెలామణిలో ఉంది. గతంలో విమర్శకులు ఒక రచనను అంచనా వేసే క్రమంలో కొన్ని ప్రమాణాలను, సిద్ధాంతాలను పాటించే వారు. కట్టమంచి రామలింగారెడ్డి దగ్గర నుంచి త్రిపురనేని మధుసూదన రావు వరకు విమర్శ పద్ధతిగా సాగింది. ఆ తర్వాత వచ్చిన అనేకమంది విమర్శకులు ఆ పునాదిగా మాట్లాడారు కానీ కొత్త సిద్ధాంతాలను ప్రకటించడం లేదా సరికొత్త పరికరాలను అన్వేషించడం చేయలేదు. ప్రాచీన సాహిత్యాన్ని అంచనా వేయడానికి అనేకమంది తెలుగు విమర్శకులు పూనుకుని ప్రణాళిక ఇచ్చారు. ఆ తర్వాత అభ్యుదయ సాహిత్య విమర్శ, దళితవాద విమర్శ, స్త్రీవాదవిమర్శ, ప్రాంతీయవాదం వీటిల్లో కూడా కొంతమేర కృషి జరిగింది. ప్రపంచీకరణ ప్రభావం కూడా విమర్శలో కనిపించింది. జి. లక్ష్మీనరసయ్య దళిత కళాతత్వ విమర్శ లోనూ దేశీయ మార్క్సిజం ఆలోచన చేశారు. మేడిపల్లి రవికుమార్ తనదైన కోణాల నుంచి విమర్శ చేశారు కానీ ఆయన ఎక్కడ దాన్ని సమగ్రంగా రాత రూపంలో తీసుకు రాలేదు. పాపినేని శివశంకర్ ద్రవాధునికత మీద మాట్లాడారు. రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మార్క్సిస్ట్ పునాదుల మీద మాట్లాడారు. తిరుపతి రావు ఆధునికోత్తరవాదం గురించి చర్చించారు. సీతారాం పర్యావరణ కోణంలో సాహిత్య విమర్శకు కృషి చేస్తున్నారు. అయితే ఈ కాలంలో విమర్శ పరిస్థితి ఏంటి? విమర్శకుడు అనే భ్రమలో వ్యాసాలు రాస్తున్న వాళ్ళ పరికరాలు ఏమిటి? తమవైన సిద్ధాంతాల ప్రాతిపదిక ఏమైనా ఉందా? సాహిత్య విమర్శకి సిద్ధాంత భూమిక వుండి తీరాలి. అప్పుడే కళకి సంబంధించిన లోతులనీ ఎత్తులనీ విశ్లేషణ చేయగలం. ఇందుకు భిన్నంగా తక్షణ స్పందన కోసం విమర్శ పేరుతో సామాజిక మాధ్యమాలలో వ్యాసాలు రాయడం చూస్తున్నాం. ఒక రచన మీద స్పందన విమర్శ రూపంలో తెలపడం తప్పు కాదు గానీ, మాట్లాడుతున్న వారి భూమిక ఏంటో స్పష్టంగా తెలియాలి. తీవ్రమైన అధ్యయనం తర్వాత మాత్రమే విమర్శ రంగంలోకి అడుగు పెట్టాలి. మారుతున్న సమాజంలో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శను కూడా మనం స్వీకరించాలి. ఐతే అది విమర్శ అయి ఉండాలి. కువిమర్శ కాకూడదు. సమీక్ష పాఠకుడిని రచన దగ్గరకు తీసుకెళ్లగలదు. కానీ విమర్శ రచనని పాఠకుల లోపలికి తీసుకెళ్లగలగాలి. మారుతున్న సామాజిక విలువలను, మానవ సంబంధాల్లోని అసమతుల్యతను మన సాహిత్యం కళాత్మకంగా చిత్రీకరించగలుగుతుందా లేదా వంటి పరిణామాల మీద విమర్శకుడు దృష్టి పెట్టాలి. విమర్శకుడు రచన కంటే ముందుండాలి. గత పదిహేను సంవత్సరాలుగా దేశంలో రాష్ట్రంలో జరిగిన అనేక పరిణామాలను సాహిత్యం చిత్రీకరించగలిగిందా? కేవలం సాహిత్య విలువలు కలిగిన రచనలు మాత్రమే వచ్చాయా? సాహిత్యంలో సమాజం ఎట్లా ప్రతిబింబించింది? సౌందర్యాత్మక రచనల ప్రతిఫలనాలు ఏమిటి? ఈ కాలపు విమర్శకులు ఎట్లాంటి సాధనాలతో అంచనా వేయగలిగారో, వేయగలరో చూడాలి. సృజన ఉంటేనే విమర్శ. ఒక కాలపు సృజన లేదా ఒక రచయిత సృజన ఆధారంగానే విమర్శ పరికరాలను సిద్ధం చేసుకోవాలి.

కవి లేదా రచయిత తీసుకున్న వస్తువు అందరిచేత ఆమోదం పొందాలని భావించి రచనకు పూనుకుంటాడు. ఎక్కువమంది పాఠకులు దాన్ని ఆమోదించినప్పుడు ఆ రచన విలువ పెరుగుతుంది. ఆ విలువను ఖరారు చేయగలిగిన వాడు విమర్శకుడు. విమర్శకుడు ఒక రచనను అంచనా వేయడంలో సాహిత్య విలువలను, సామాజిక విలువలను దృష్టిలో ఉంచుకోవాలి. ఒక రచనను విమర్శ చేసే సందర్భంలో విమర్శకుడు ఏ ప్రలోభాలకు లొంగని న్యాయమూర్తి పాత్ర పోషించాలి. రచనని ఆకాశానికి ఎత్తేస్తూ వ్యాసం రాయడం విమర్శ కాదు. రచనను పాతాళానికి తోసేస్తూ మాట్లాడటమూ విమర్శ కాదు. ప్రతి రచనా ప్రభావవంతంగా ఉండాలని రచయితలు ఆశిస్తారు. కొన్ని సందర్భాల్లో రచన ప్రభావంతంగా లేనప్పుడు, రచయిత ఉన్నతిని కోరుకునే విధంగా విమర్శకుడి భాష ఉండాలి. గత పదిహేను సంవత్సరాలుగా తెలుగు విమర్శను పరిశీలించినప్పుడు సరికొత్త సిద్ధాంతాల ప్రకటనలు ఏమీ లేవని అర్థమవుతుంది. కేవలం మార్క్సిస్టు విమర్శ, ద్రవాధునికత, పోస్ట్ మోడర్నిజం ప్రాతిపదిక మీదగా మాత్రమే చాలామంది విమర్శకులు వ్యాసాలు రాస్తున్నారు. ఆ వస్తున్న వ్యాసాల్లోనూ సారం తక్కువ. ఈ కాలపు సాహిత్య విమర్శలో కేవలం విశ్లేషణ మాత్రమే మనం చూస్తున్నాం. మరి కొంతమంది కేవలం లోపాలు చెప్పడం మాత్రం విమర్శ అనే భ్రమలో ఉన్నారు. ఏదైనా ఒక విమర్శను చేసినప్పుడు అందులో విమర్శకుడు తన పరికరాలు ఏమిటో, నిరూపణలు ఏమిటో చెప్పాలి. సాహిత్య విమర్శలలో వివరణలు ఉండవచ్చు. విశ్లేషణ ఉండవచ్చు. వివేచన ఉంటుంది. సమన్వయం ఉంటుంది. మూల్యాంకనము ఉంటుంది. ఇట్లాంటి లక్షణాలు కలిగిన విమర్శకులు రావాలి. సాహిత్య వికాసంలో విమర్శ ఒక భాగం. ఒక కవిత సంపుటిని లేదా కవిత్వాన్ని విలువ కట్టడానికి ఇవాళ విమర్శకులు కొత్త ప్రమాణాలను రూపొందించినట్లు కనబడదు.కేవలం వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం ఈ నాలుగు మాటలతో వ్యాసం రాస్తే అది విమర్శ అని సాహిత్య లోకంలో ఇప్పుడు చెలామణిలో ఉంది. గతంలో విమర్శకులు ఒక రచనను అంచనా వేసే క్రమంలో కొన్ని ప్రమాణాలను, సిద్ధాంతాలను పాటించే వారు. కట్టమంచి రామలింగారెడ్డి దగ్గర నుంచి త్రిపురనేని మధుసూదన రావు వరకు విమర్శ పద్ధతిగా సాగింది. ఆ తర్వాత వచ్చిన అనేకమంది విమర్శకులు ఆ పునాదిగా మాట్లాడారు కానీ కొత్త సిద్ధాంతాలను ప్రకటించడం లేదా సరికొత్త పరికరాలను అన్వేషించడం చేయలేదు. ప్రాచీన సాహిత్యాన్ని అంచనా వేయడానికి అనేకమంది తెలుగు విమర్శకులు పూనుకుని ప్రణాళిక ఇచ్చారు. ఆ తర్వాత అభ్యుదయ సాహిత్య విమర్శ, దళితవాద విమర్శ, స్త్రీవాదవిమర్శ, ప్రాంతీయవాదం వీటిల్లో కూడా కొంతమేర కృషి జరిగింది. ప్రపంచీకరణ ప్రభావం కూడా విమర్శలో కనిపించింది. జి. లక్ష్మీనరసయ్య దళిత కళాతత్వ విమర్శ లోనూ దేశీయ మార్క్సిజం ఆలోచన చేశారు. మేడిపల్లి రవికుమార్ తనదైన కోణాల నుంచి విమర్శ చేశారు కానీ ఆయన ఎక్కడ దాన్ని సమగ్రంగా రాత రూపంలో తీసుకు రాలేదు. పాపినేని శివశంకర్ ద్రవాధునికత మీద మాట్లాడారు. రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మార్క్సిస్ట్ పునాదుల మీద మాట్లాడారు. తిరుపతి రావు ఆధునికోత్తరవాదం గురించి చర్చించారు. సీతారాం పర్యావరణ కోణంలో సాహిత్య విమర్శకు కృషి చేస్తున్నారు. అయితే ఈ కాలంలో విమర్శ పరిస్థితి ఏంటి? విమర్శకుడు అనే భ్రమలో వ్యాసాలు రాస్తున్న వాళ్ళ పరికరాలు ఏమిటి? తమవైన సిద్ధాంతాల ప్రాతిపదిక ఏమైనా ఉందా? సాహిత్య విమర్శకి సిద్ధాంత భూమిక వుండి తీరాలి. అప్పుడే కళకి సంబంధించిన లోతులనీ ఎత్తులనీ విశ్లేషణ చేయగలం. ఇందుకు భిన్నంగా తక్షణ స్పందన కోసం విమర్శ పేరుతో సామాజిక మాధ్యమాలలో వ్యాసాలు రాయడం చూస్తున్నాం. ఒక రచన మీద స్పందన విమర్శ రూపంలో తెలపడం తప్పు కాదు గానీ, మాట్లాడుతున్న వారి భూమిక ఏంటో స్పష్టంగా తెలియాలి. తీవ్రమైన అధ్యయనం తర్వాత మాత్రమే విమర్శ రంగంలోకి అడుగు పెట్టాలి. మారుతున్న సమాజంలో

## భారత పుత్రికలు చరిత్ర సృష్టించారు: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

ఇంటర్నెట్‌డెస్క్: క్రికెట్‌లో భారత పుత్రికలు చరిత్ర సృష్టించారని ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ విజయం దేశ మహిళల్లో ఆత్మవిశ్వాసానికి చిహ్నమని అభివర్ణించారు. భారత మహిళా జట్టు తొలిసారి వన్డే ప్రపంచకప్ విజేతగా నిలవడంపై ఈ విధంగా స్పందించారు. బిహార్ లోని సహర్సాలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. ఎన్డీయే అంటే వికాసమని, మహాగఠ్ బంధన్ అంటే వినాశనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడేలా తొలిసారి ఓటువేసే వారు తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు.

"నేను విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు అక్కడి నేతలకు మఖానా బాక్స్‌లను కానుకగా అందజేశాను. ఇది బిహార్ కార్మికుల శ్రమకు నిదర్శనమని చెప్పాను. అలాగే కోసి నది వరదల ప్రభావాన్ని తగ్గించేలా శాశ్వత పరిష్కారం కోసం మేం కృషి చేస్తున్నాం" అని మోదీ అన్నారు. ఆర్జేడీ 'జంగల్ రాజ్'లో పోలీసులు కూడా సురక్షితంగా లేరని, చట్టాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకున్న డీఎస్పీ సత్యపాల్‌సింగ్‌ను హత్య చేశారని విమర్శించారు. ద

## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు మార్చండి.. కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేయాలి. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలి"అని మంత్రి తుమ్మల కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

## సమర్థ నాయకత్వం ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్: నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి

పెట్టుబడుల ఆకర్షణకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొచ్చాం. పోటీపడి పెట్టుబడులు సాధిస్తున్నాం. అనుభవం, సమర్థ నాయకత్వం ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అర్సెల్లార్ మిత్తల్ పెట్టుబడుల కోసం ప్రధాని మోదీని చంద్రబాబు 2 సార్లు కలిశారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించబోయే సీఐఐ సమ్మిట్‌కు పలువురు కేంద్ర మంత్రులు, పారిశ్రామిక వేత్తలు వస్తున్నారు. 45 దేశాల నుంచి 300 మంది పారిశ్రామిక వేత్తలు వస్తున్నారు. 410కి పైగా ఒప్పందాలు జరగనున్నాయి. ఇన్వెస్టర్లు, ప్రభుత్వం, ప్రజలు కలిస్తేనే.. ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టగలం. 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆగిపోవట్లేదు.. ఇంకా సాధించాలి" అని నారా లోకేశ్ అన్నారు.

**వైకాపా విద్వేషాలు రెచ్చగొడుతోంది**

కులం, మతం పేరిట వైకాపా విద్వేషాలు రెచ్చగొడుతోంది. గూగుల్ పెట్టుబడులపై వైకాపా నేతలు దుష్ప్రచారం చేశారు. విశాఖలో చెట్లు పెరగవని అక్కడి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. పెట్టుబడులకు వైకాపా నేతలు సిఫార్సు చేసినా అంగీకరిస్తాం. రాష్ట్రాభివృద్ధి కోసం ముందుకొస్తే.. కలిసికట్టుగా ముందుకెళ్దాం. ఎన్నికలొచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధే మన ధ్యేయం కావాలి" అని లోకేశ్ అన్నారు.

## అడవి ఏనుగుల కట్టడికి సరికొత్త సాంకేతికత: పవన్ కల్యాణ్



అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పంటపొలాలు ధ్వంసం చేస్తున్న అడవి ఏనుగులను కట్టడి చేసేందుకు సరికొత్త సాంకేతికత అందుబాటులోకి తెచ్చినట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. కృత్రిమ మేధ ఆధారంగా, సౌరశక్తి సాయంతో ఈ వ్యవస్థ పని చేస్తూ ఏనుగుల సంచారాన్ని గుర్తించి, వాటిని భయపెట్టి పంపించి వేస్తుందన్నారు. సహజ సిద్ధమైన నిరోధక వ్యవస్థను చిత్తూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించినట్లు పవన్ వెల్లడించారు.అటవీ ఏనుగుల సమస్య పరిష్కారానికి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి 4 కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకువచ్చారు. గ్రామాల్లోకి చొరబడిన అడవి ఏనుగులను కుంకీలు అడ్డుకుని అడవిలోకి మళ్లించాయి. దీనికి తోడు ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ సాంకేతికతతో పనిచేసే సరికొత్త వ్యవస్థను ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు.ఏనుగులను గుర్తించిన వెంటనే తుపాకీ కాల్చిన శబ్దాలతో వాటిని భయపడేలా చేసి అక్కడి నుంచి పంపించి వేస్తాయి. అలాగే, అటవీ శాఖ అధికారులకు సంకేతాలు పంపిస్తాయి. తద్వారా మనుషులతో పాటు వన్యప్రాణులకు ఈ రక్షణ వ్యవస్థ ఉపయోగపడుతుందని పవన్ తెలిపారు. ఈ సాంకేతికత వ్యవస్థ.. ఏర్పాటు చేసిన ప్రాంతంలో 60 మీటర్ల పరిధిలో 120 డిగ్రీల కోణంలో నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. ఏనుగుల నియంత్రణలో కుంకీల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానాలు అందరికీ ఆదర్శనీయంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ చెప్పారు.

## ట్రావెల్స్ బస్సు బోల్తా.. ఒకరి మృతి.. పలువురికి గాయాలు




లింగపాలెం: ఏలూరు జిల్లా లింగపాలెంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఏలూరు నుంచి హైదరాబాద్ వెళ్తోన్న భారతి ట్రావెల్స్ బస్సు.. జూబ్లీనగర్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. వారిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్, క్లీనర్ సహా 17 మంది ఉన్నారు. క్షతగాత్రులను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బస్సు అదుపు తప్పినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. మృతుడిని లింగపాలెం మండలానికి చెందిన ప్రవీణ్‌బాబుగా గుర్తించారు.

# చేవెళ్ల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

టీఎస్ 34 టీఏ 6354 నంబరు గల ఆర్టీసీ బస్సు తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తాండూరులో ఉదయం 4.40 గంటలకు బస్సు బయల్దేరింది. అక్కడ 30 మందికి పైగా ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు ఎక్కారు. మొత్తంపై బస్సులో సుమారు 72 మంది ప్రయాణికులు ఉన్నారు. విద్యార్థులు హైదరాబాద్‌లోని పలు కళాశాలల్లో చదువుతున్నట్లు సమాచారం. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లకు వెళ్లి.. తిరిగి నగరానికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. రోడ్డు ప్రమాదంతో హైదరాబాద్-బీజాపూర్ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఈ ఘటనతో చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 15 మంది ప్రయాణికులతో పాటు బస్సు కండక్టర్ రాధను పోలీసులు రక్షించారు. కండక్టర్‌కు గాయాలు కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. సహాయక చర్యలు జరుగుతున్న సమయంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌పైకి జేసీబీ ఎక్కడంతో ఆయన ఎడమ కాలికి గాయమైంది. సీఐను చేవెళ్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ కొనడంతో బస్సులోకి టిప్పర్ దూసుకెళ్ళింది. ఈ ప్రమాదంజరిగినప్పుడు బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగటంతో సీట్లలోనే వీరు ఇరుక్కుపోయారు. టిప్పర్ లోని కంకర బస్సులో పడడంతో ముందు వరుసలో ఉన్న 5 సీట్లు డ్యామేజ్ అయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఇప్పటికే ఈ ప్రమాదంలో బస్సులో ఇరుక్కుపోయి.. గాయపడిన 15 మందిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గురైన బస్సు తాండూరు నుండి హైదరాబాద్ వెళ్తుండగా చేవెళ్ల మండలం మిర్జాగూడ దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో చేవెళ్ల-వికారాబాద్ మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇటీవల జరిగిన కర్నూల్ బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనం అయిన ఘటన మరువకముందే.. ఈ ఘటన జరగడం రాష్ట్రంలో విషాదాన్ని నింపింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద దృశ్యాలు పలు హృదయాలను కలిచివేస్తున్నాయి. వాహనాలు వేగంగా ఒకదానికొకటి ఢీ కొనడంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 20 మంది మృతి చెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో బస్సు, లారీ డ్రైవర్లు సహా 10 మంది పురుషులు, 9 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. ఘటన సమయంలో ప్రయాణికుల ఆర్తనాదాలు చేయడం గుండెను పిండేసేవిగా ఉన్నాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మూడు జేసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు.

## ప్రమాద ఘటనపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

మొదటి పేజీ తరువాయి

చేవెళ్ల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనపై దిగ్భ్రాంతి చెందారు. అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని రేవంత్ రెడ్డి తెలిపారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారందరినీ వెంటనే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని డీజీపీలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు వెంటనే ప్రమాద సంఘటనకు చేరుకోవాలని పేర్కొన్నారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సీఎం సూచించారు. ప్రమాదంపై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చేవెళ్ళలో జరిగిన రోడ్డు ప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డవారికి తగిన వైద్య చికిత్సలు చేయాలని సూచించారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మృతులకు మహేష్ కుమార్ గౌడ్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## బస్సు ప్రమాద ఘటనపై కెసిఆర్ దిగ్భ్రాంతి

మొదటి పేజీ తరువాయి

వారి కుటుంబాలకు సంతాపాన్ని ప్రకటించారు. మరణించిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఖానాపూర్ స్టేజి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఈ దుర్ఘటనలో 20 మంది ప్రయాణికులు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటం పట్ల ఆయన సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సాయం అందించాలని, మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చేవెళ్ల ఘోర రోడ్డు ప్రమాదంలో 20 మందికి పైగా మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు ప్రభుత్వం వెంటనే మెరుగైన వైద్యం అందించాలని.. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

## ఎల్లయ్యగౌడ్ కుటుంబంలో తీవ్ర విషాదం

మొదటి పేజీ తరువాయి

గత నెల 15న జరిగిన ఓ పెళ్లివేడుకలో సందడిగా గడిపారు. తల్లిదండ్రులతో పాటు బంధువులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఎల్లయ్యగౌడ్ డ్రైవర్‌గా పనిచేస్తూ పిల్లల్ని చదివించారు. ఆయనకు నలుగురు కుమార్తెలు. ఒక కుమార్తెకు వివాహం కాగా.. మిగిలిన ముగ్గురు కుమార్తెలు సోమరవాం జరిగిన రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో ఆ కుటుంబం, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మరోవైపు యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన అఖిలరెడ్డి అనే యువతి కూడా ఇదే ప్రమాదంలో చనిపోయారు. ఎంబీఏ చదువుతున్న కుమార్తె మృతితో అఖిల తల్లి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఘటనాస్థలానికి వచ్చి బోరున విలపించారు.

## చేవెళ్ల రోడ్డు ప్రమాదం.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం: పొన్నం

మొదటి పేజీ తరువాయి

వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించాం. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం" అని మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆర్టీసీ తరఫున రూ.2 లక్షలు ఇస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

## 'ఎస్ఐఆర్'కు ఈసీ రెడీ.. 12 రాష్ట్రాలు/యూటీల్లో అమలు

ఇంటర్నెట్ డెస్క్: ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 4 నుంచి తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 51 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.ఈ నెల 4 నుంచి డిసెంబరు 4 వరకు ఈసీ ఓటర్ల వివరాల సేకరణ నిర్వహించనుంది. డిసెంబరు 9న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో 'ఎస్ఐఆర్' ముగియనుంది. ఈ జాబితాలోని పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిల్లో 2026లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అస్సాంలోనూ వచ్చే ఏడాది ఎన్నికలు ఉండగా..

# రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు

ఇది కథ నిజం న్యూస్
ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించేందుకు చేవె ళ్ల ప్రభుత్వ హాస్పిటల్‌కు hb మరికాసేపట్లో చేరుకోనున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, వైద్య విధాన పరిషత్ కమిషనర్, డాక్టర్ అజయ్ కుమార్ ఉస్మానియాలో క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు సీనియర్ ప్రొఫెసర్లతో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం..మంత్రి సూచనలతో ఉస్మానియా చేరుకున్న మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్ మృతుల పోస్ట్‌మార్టమ్ కోసం గాంధీ, ఉస్మానియా నుంచి ఫోరెన్సిక్ నిపుణులతో బృందాల ఏర్పాటు మృతుల కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలగకుండా వీలైనంత త్వరగా మృతదేహాలను అందించేందుకు చర్యలు చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించేందుకు చేవెళ్ల హాస్పిటల్‌కు బయల్దేరిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గార చేవెళ్ల సీహెచ్‌సీలో మృతుల కుటుంబాలను పరామర్శించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించిన మంత్రి వీలైనంత త్వరగా పోస్ట్‌మార్టమ్ ప్రక్రియ పూర్తి చేసి, కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించాలని డాక్టర్లను ఆదేశించిన మంత్రి పీఎంఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చేవెళ్ల రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేషెంట్ల కండీషన్‌ను మంత్రికి వివరించిన డాక్టర్లు.. ఎవరికీ ప్రాణాపాయం లేదని తెలిపిన డాక్టర్లు..ఒక్కరికి మాత్రమే హెడ్ ఇంజూరి అయిందని, మిగిలిన



పేషెంట్లందరి కండీషన్ స్టేబుల్‌గా ఉందని వివరించిన డాక్టర్లు.. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించిన మంత్రి వైద్యానికి అయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపిన మంత్రి

## ప్రకృతితో సన్నిహితంగా విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్‌లో పాల్గొన్న మాదిరి ప్రిథ్వీరాజ్

ఇది కథ నిజం న్యూస్
పటాన్‌చెరు జె.పి. ఫార్మ్‌లో సేంద్రియ వ్యవసాయ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో యూరోకిడ్జ్ స్కూల్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో పాల్గొని సేంద్రియ పద్ధతుల్లో పంటల పెంపకం, సహజ



ఎరువుల వినియోగం వంటి అంశాలను ప్రత్యక్షంగా నేర్చుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన స్కూల్ యాజమాన్యం మహేష్ గారిని మాదిరి ప్రిథ్వీరాజ్ గారు అభినందించారు. విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన కల్పించారు. ఈ ఫీల్డ్ ట్రిప్ ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ చైతన్యం మరియు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ప్రిథ్వీరాజ్ గారు సూచించారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

ఇది కథ నిజం న్యూస్



తెలంగాణ రాష్ట్రం ప్రజ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంద్రమ్మ ఇల్లు, పేద మధ్య తరగతి బలహీన వర్గాల ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకొని ఏ ఒక్క పేదవాడు ఇల్లు లేకుండా సగౌరవంగ ఉండడానికి ఇల్లు అవసరం కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఇంద్రమ్మ ఇండ్లను పేదవారికి ఇవ్వడం జరుగుతుంది . అందులో భాగంగా ఝరాసంఘం మండలం లోని కక్కెర వాడ గ్రామంలో మొట్టమొదటి ఇంద్రమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఝరాసంఘం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు పాటిల్ సంగారెడ్డి యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పటిల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ షకీల్ మాజీ ఎంపీటీసీ మారుతీ పటిల్, మాజీ సర్పంచులు వేణుగోపాల్ రెడ్డి రామ్ రెడ్డి ఉప సర్పంచ్ అమృత్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరులో ఉచిత కంటి పరీక్షల శిబిరం:

ఇది కథ నిజం న్యూస్



సుమిత్ర ఐ కేర్ హాస్పిటల్ జహీరాబాద్ వారి అధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం ఝరాసంగం మండలం లోని కొల్లూరు గ్రామ పంచాయితీ ఆవరణలో ఏర్పటు చెయ్యడం జరిగింది. ఇట్టి కార్యక్రమములో మాజీ ఎంపీటీసీ సీహెచ్ రాజ్ కుమార్, కొల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డప్పూరు సంగమేష్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతలగట్టు శివరాజ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మండల బీసీ జేఏసీ ఉపాధ్యక్షులు దిగంబర్,మలగరి బాలప్ప, మొగుడంపల్లి విష్ణు,డప్పూర్ రాములు,కుమ్మరి దశరథ్, మరియు హాస్పిటల్ సిబ్బంది,గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు,వృద్ధులు పాల్గొన్నారు ఇట్టి కార్యక్రమములో కంటి సమస్యలు ఉన్నవారికి కంటి పరీక్షలు చేసారు.

## ముగిసిన షూటింగ్ సందడి.


– సినిమా షూటింగ్ కాదు ఓన్లీ ప్రోమో.

ఇది కథ నిజం న్యూస్
సంగారెడ్డి జిల్లా, కంది రహదారికి అనుకొని ఉన్న పంజాబీ హర్యానా డాబా లో, గత మూడు రోజులుగా ఓ ప్రోమోకు సంబంధించిన షూటింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రోమో కోసం ప్రముఖ యాక్టర్ డైరెక్టర్ వంశీధర్ గౌడ్,( ఫస్ట్ డే ఫస్ట్ షో సినిమా ఫేమ్). రైటర్ షాలినితో పాటు ప్రముఖ యంగ్ కమెడియన్ అయినా వైవా హర్షాలు ఈ షూటింగ్లో పాల్గొన్నారు. సోమవారం షూటింగ్ షెడ్యూల్ ఫైనల్ కావడంతో మధ్యాహ్నం వరకు ఈ ముగ్గురు మధ్యలో ఉన్న కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరణ పూర్తి చేసుకొని యూనిట్ బృందం వెళ్లిపోయారు. అయితే ఇది సినిమాకు సంబంధించిన షూటింగ్ కాదని, ఒక డైరెక్షన్ కెపాబిలిటీ నిరూపించుకునే ప్రోమో కోసమే ఈ షూటింగు చేస్తున్నట్టు తెలిసింది, మరి ఈ షూటింగ్ సంబంధించిన చిత్రీకరణ విషయాలు ఏంటి అనేది మరికొన్ని రోజుల్లో తెలిసే అవకాశం చిత్ర బృందం తెలిపారు.




## కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి

ఇది కథ నిజం న్యూస్
సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ మాధురి, ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రజలు వినతి పత్రాలను సమర్పించారు. ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.



## కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కొంతమంది హైడ్రా అధికారులు పనిచేస్తున్నట్లు అనుమానం

ఇది కథ నిజం న్యూస్
కలుగుతోంది. టిఆర్ఎస్ కు లాభం చేసేలా కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వానికి నష్టం చేసేలా కొంతమంది అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారని నాకనిపిస్తోంది. వారిపైన హైడ్రా చీఫ్ రంగనాథ్ దృష్టి పెట్టాలి. అధికారులు అత్యుత్సాహం వల్ల కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న చెడ్డ పేరుని ప్రతిపక్షాలు ఎక్కువగా జనంలోకి తీసుకెళ్తున్నాయి. నేను ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టికి, పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ గారి దృష్టికి తీసుకువెళ్తాను. అటువంటి అధికారుల కుట్ర లకు అడ్డుకట్ట వేయాలి. ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి దీనిపైన విచారణ కూడా జరగాలి. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నీ ఓడించేందుకు హైడ్రా నీ అడ్డుపెట్టుకుని కొంతమంది టిఆర్ఎస్ అనుకూల అధికారుల సహకారంతో టిఆర్ఎస్ పార్టీ ప్రయత్నం చేస్తున్నట్లు కనబడుతోంది. ఈ హైడ్రా దాడులను టిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో ఎక్కువగా ప్రచారం చేస్తోంది.



## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి.

ఇది కథ నిజం న్యూస్
గౌరవనీయులైన వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ మరియు దుర్గారెడ్డి ఆదేశాల మేరకు ఈరోజు పుల్కాల్ మండలంలోని ఇసోజీపేట్ గ్రామాలలో లివరి కొనుగోలు కేంద్రామున్ ప్రారంభించారు– గ్రేడ్ ధాన్యానికి రూ. 2,389, బీ–గ్రేడ్కు రూ. 2,369 చొప్పున ధర సన్నవాడ్లది బోనస్ 500 ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మున్నూరు మాణిక్యం ఉపధ్యక్షులు శివనోళ్ల గణపతి మాజీ ఎంపిటిసి రవికుమార్ సుఖేందర్ రెడ్డి నారాయణరెడ్డి రాంరెడ్డి షాన్ పాషా మహబూబ్ యాదిరెడ్డి దేశ రెడ్డి రవికుమార్ డీలర్ శ్రీశైలం గౌడ్ లక్ష్మయ్య నారాయణ శ్రీనివాస్ నర్సింలు శ్రీశైలం నరసింహారెడ్డి మహ్మద్ హుస్సేన్ వెంకట్ రెడ్డి సంగమేశ్వర్ బాలయ్య రైతులు పాల్గొన్నారు



## ప్రేమ వివాహం నచ్చక ఇంటకి నిప్పు

ఇది కథ నిజం న్యూస్
ఝరాసంగం మండలం లో కక్కెరవాడ గ్రామం లో బోయిని నగేష్ తండ్రి రాములు వయసు 24 సంవత్సరాలు కులం ముదిరాజ్ కక్కర్వాడ గ్రామం నివాసుడు ఉదయం తన ఇంటి వద్ద తన యొక్క రోజు వారి పనులు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన గొల్ల విటల్ మరియు అతని కొడుకు అయిన గొల్ల పాండు ఇద్దరు కలిసి విటల్ కూతురు అయిన మౌనిక బోయిని రాములు కుమారుడైన రాధాకృష్ణ తో ప్రేమ వివాహం నచ్చక ఈరోజు తండ్రి కొడుకులు బోయిని నగేష్ మరియు భోగి రాములపై దాడి చేయడం జరిగింది . ఈ దాడిలో బోయిని నాగేష్ కు మూగ దెబ్బలు తగలగా తండ్రి రాములకు తీవ్ర గాయాలయ్యాయి



## బస్సు ప్రమాదం.. పటాన్ చెరు నుంచి వెళ్లిన టిప్పర్

ఇది కథ నిజం న్యూస్




రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద ఆర్టీసి బస్సు ప్రమాదంలో 24 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. దీనికి ప్రధాన కారణమైన టిప్పర్ పటాన్ చెరు లక్షారం క్రషర్ నుంచి బయలుదేరినట్లు సమాచారం. గత కొన్ని రోజుల కింద జరిగిన కర్నూల్ బస్సు ప్రమాదం కూడా ట్రావెల్స్ బస్సు పటాన్ చెరు నుంచి బయలుదేరిందని, పటాన్ చెరు నుంచి బయలుదేరే వాహనాలు మృత్యువును వెంటాడుతున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## కానరాని ఆర్టీసీ బస్సు

గత వారం రోజులుగా నిలిపివేసిన అధికారులు.

ఇది కథ నిజం న్యూస్



తెలంగాణ ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూర్చే రహదారులలో బస్సుల సౌకర్యం నిలిచిపోవడంతో మహబూబాబాద్ జిల్లాకొత్తగూడ మండలం ఏజెన్సీ గ్రామాల ప్రజలు నాన్న ఇబ్బందులు పడుతున్నారు... వీరి ఇబ్బందులను... క్యాష్ గా ఎంచుకుంటున్న ప్రైవేట్ వాహన దారులు...మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ గంగారం ఉమ్మడి మండలాలలోని 110 గ్రామాలకు గత వారం రోజులుగా ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు అక్టోబర్ 29 నుండి మొంథా ప్రభావంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. దీంతో రెండు మండలాల ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టులు దెబ్బ తినడంతో బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. దీంతో ఈ గ్రామాల ప్రజలు అత్యవసర పనుల మీద వెళ్లాలన్నా ఇతరు ఏ పనుల మీద వెళ్లాలని... ప్రైవేట్ వాహనాల ఆశ్రయిస్తే దీన్ని అలుసుగా చూసుకొని ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## ప్రజావాణి 32 దరఖాస్తులు

జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు.

ఇది కథ నిజం న్యూస్
సోమవారం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి 32 దరఖాస్తుదారులు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రతి అర్జీ పై తక్షణ చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు అలాగే ప్రజల ప్రధాన సమస్యలపై పూర్తి దృష్టి ,పెట్టి పరిష్కార ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి , డి.ఆర్.ఓ పద్మజ రాణి నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## కొల్లూరు డబుల్ బెడ్రూం కాలనీలో హైస్కూల్ భవనం, పార్క్, గ్రేవ్ యార్డ్ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఇది కథ నిజం న్యూస్



అక్కడే నిర్మాణంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని మంత్రులు పరిశీలించారు. కొల్లూరు డబుల్ బెడ్రూం కాలనీ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పీచ్ పాయింట్లు కొల్లూరు ఒక మినీ హైదరాబాద్.. ఇక్కడ మీరందరూ కలిసి జీవించడం సంతోషంగా ఉంది.8 కోట్ల రూపాయలతో 60 గదుల స్కూల్ భవనం, అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం.సంక్రాంతి నాటికి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి, ఇక్కడే మీకు వైద్య సేవలు అందిస్తాం.మీ ఇంటి ముంగిట్లోనే డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.108 అంబులెన్స్ వాహనం కూడా ఇక్కడ అందుబాటులోకి తీసుకొస్తాం.మీకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఇక్కడే కల్పించి, ఆదర్శ కాలనీగా కొల్లూరును తీర్చిదిద్దుతాం.

## రివాల్వర్తో కాల్చుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య

ఇది కథ నిజం న్యూస్
సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్గా పనిచేస్తున్న సందీప్ మహబూబ్నాగర్ చెరువు కట్టపై రివాల్వర్ కాల్చుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్వేర్కు చెందిన సందీప్ ఏడాదికాలంగా పట్టణ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్గా పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ పరితోష్ పంకజ్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



# 42% బీసీ రిజర్వేషన్లు తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే అమలుచేయాలి

**– ఆత్మకూరులో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ వినతి పత్రం సమర్పణ**



ఇది కథ నిజం న్యూస్

రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రథసారదులు, జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవి, డాక్టర్ విశారదన్ మహరాజ్ సూచనల మేరకు 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ కోఆర్డినేటర్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ మైదం రవి మాట్లాడుతూ ం "రాష్ట్ర ప్రభుత్వం 2025 మార్చిలో బిల్లులు నం.3, 4 ద్వారా విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచింది. ఆ బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినప్పటికీ కేంద్రం వద్ద తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడానికి పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లులు అమలు చేయాలి" అన్నారు. అలాగే రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లులను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ చేపట్టి అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. ఆత్మకూరు యాదవ సంఘం అధ్యక్షుడు మిర్యాల కుమార్ మాట్లాడుతూ "కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

# జిల్లా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: ఎన్ ఎచ్ ఆర్ సి జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్.



ఇది కథ నిజం న్యూస్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గత ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి 10,000/ వేల చొప్పున నష్ట పరిహారం అందిస్తామని ప్రకటించింది. వ్యవసాయ అధికారులతో పంట నష్ట నివారణ సర్వే నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 4722 మంది రైతులుఉన్నట్టు గుర్తించింది. సర్వే నిర్వహించి నేటికీ 3 నెలలు గడుస్తున్నా రైతులకు నష్టపరిహారం నిధులు విడుదల కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. దీనికి తోడు ప్రస్తుతం మెంథా తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు రైతులకు చేతికి అందిన పంట వర్షాలకు తడిసి నాశనం అయ్యింది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రైతులు ప్రవేట్ వ్యాపారస్తులకు పంటను అమ్ముతూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

# రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఉదయశ్రీకి

**– ఎంఈఓ కొర్ర సారయ్య అభినందనలు**



ఇది కథ నిజం న్యూస్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సీనియర్స్ ఖో ఖో ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జడ్పీఎస్ఎస్ బాయ్స్ హై స్కూల్ నర్సంపేట విద్యార్థిని ఎడ్ల ఉదయశ్రీను ఎంఈఓ కొర్ర సారయ్య అభినందించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఉదయశ్రీ ప్రతిభను ప్రశంసిస్తూ, నర్సంపేట బాయ్స్ హై స్కూల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ కొర్ర సారయ్య ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలు పెద్దపల్లి జిల్లాలో నవంబర్ 6 నుండి 9 వరకు జరుగనున్నాయని పాఠశాల పీడీ కోట రాంబాబు తెలిపారు. ఉదయశ్రీకి శిక్షణ ఇచ్చిన పీడీ కోట రాంబాబు ని కూడా ఎంఈఓ కొర్ర సారయ్య అభినందించారు.

# పరకాలలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**– రైతులు సీసీఐ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి**



ఇది కథ నిజం న్యూస్

పరకాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని పత్తికి మద్దతు ధరను పొందాలని సూచించారు. ప్రస్తుతం తేమ శాతం 8 నుండి 12 శాతం ఉండడం వలన రైతులు నష్టపోతున్నారని, 20 శాతం వరకు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఎకరాకు 7 క్వింటాళ్ల కొనుగోలు పరిమితిని ఎత్తివేసి, 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వం మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అధికారులు వెంటనే సర్వే పూర్తి చేసి నివేదిక ప్రభుత్వానికి అందించాలని ఆయన సూచించారు. తదనంతరం ఎమ్మెల్యే కనీస మద్దతు ధర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ సత్తా చాటాలి..

**– పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**– ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ట్రాక్ సూట్ల పంపిణీ..**



ఇది కథ నిజం న్యూస్

త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్ర సత్తాను చాటాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.

ఇటీవల పటాన్చెరులో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 14 బాలురు బాలికల కబడ్డీ, అండర్ 17 బాలుర వాలీబాల్ పోటీలలో విజేతలు ఆదరించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు, కోచ్ లకు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సొంత నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్ సూట్లను ఆయన పంపిణీ చేశారు. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు రవాణా భత్యం అందించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతహాగా క్రీడాకారుడైన తాను క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో పటాన్చెరు పట్టణంలో వివిధ క్రీడల్లో జాతీయస్థాయి పోటీలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయి పోటీల్లోనూ మెరుగైన ప్రదర్శన అందించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని ఎగురవేయాలని కోరారు.

# తుఫాన్ బాధిత రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలి

**– ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని**

**– బీజేపీ నేత పెరుమాండ్ల వెంకటేశ్వర్లు డిమాండ్**



ఇది కథ నిజం న్యూస్

మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. జఫర్గఢ్ మండలం ఉప్పుగల్%-%కునూరు గ్రామాల మధ్య వర్షాలతో నష్టపోయిన పంటలను, రోడ్లను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ం "తుఫాన్ కారణంగా చేతికొచ్చిన పంటలు నేలమట్టమయ్యాయి. ఇలాంటి సందర్భాల్లో రైతులను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్బీవై) పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. అలాగే, నష్టపోయిన పంటలపై అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలి," అని పేర్కొన్నారు. అంతర్గత రోడ్లు తెగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున వాటిని వెంటనే మరమ్మత్తు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

# ఫీజు రీయింబర్స్మెంట్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**– బీసీ అజాది స్టూడెంట్ ఫెడరేషన్**

ఇది కథ నిజం న్యూస్



బీసీ అజాది స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్, ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుడికాల భాస్కర్ ఆధ్వర్యంలో భీమార్‌లో ర్యాలీ, ధర్నా నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా ఉంటే బకాయి ఉన్న 8,000 కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్ వెంటనే విడుదల చేయాలి. ప్రభుత్వ కమిషన్ల కోసం కాంట్రాక్టర్ల బిల్లులు విడుదల చేసారేమో కానీ 20 లక్షలపైగా చదువుతున్న విద్యార్థుల ఫీజు రీయంబర్స్ బిల్స్ విడుదల చేయడం లేదు. దీనివల్ల విద్యార్థులు మానసిక ఆందోళనలో పడ్డారు.రాబోయే రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే బీసీ అజాది స్టూడెంట్ ఫెడరేషన్ ప్రతి విద్యార్థిని తోడుకుని సచివాలయాన్ని ముట్టడి చేస్తామని పంజాల్ హెచ్చరించారు.ఫీజు రీయంబర్స్ విడుదలకుండానే మా పోరాటు ఆగదు అని ఆయన చెప్పారు.

## శ్రీ వేణుగోపాలస్వామి తులసి కళ్యాణం కు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలి : దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్





ఇది కథ నిజం న్యూస్

కార్తీక మాసం లో భాగంగా ప్రతి సంవత్సరం వలే ఈ సంవత్సరము కూడా జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ వేణుగోపాల స్వామి తులసి కళ్యాణం నవంబర్ 4 మంగళవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ శేషప్ప కళావేదిక పైన అత్యంత వైభవంగా నిర్వహించబడును అని ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, ఈవో శ్రీనివాస్ లు తెలిపారు అలాగే మరో అనుబంధ ఆలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో వైకుంఠ చతుర్ధి శివ పర్వదిన సందర్భంగా నవంబర్ 4 మంగళవారం రోజున రాత్రి 10 గంటల నుండి 12 గంటల వరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం విశేష పూజలు దేవస్థాన వేద పండితుల చే అత్యంత వైభవంగా నిర్వహించబడునని ధర్మపురి పట్టణ ప్రజలతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ చైర్మన్ జక్కు రవీందర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అధికారులు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వభూమి కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

**– రెవెన్యూ అధికారులు పట్టించుకోని వైనం లంచవతారంలో రెవెన్యూ సిబ్బంది**



ఇది కథ నిజం న్యూస్

కంకోల్ గ్రామకంఠంలో గల రోడ్డుకు అనుకుని ఉన్న సర్వే నంబర్ 266 లో మూడు 3 ఎకరాల 16 గుంటలు గల భూమిని కబ్జా చేయడం జరిగింది శనార్తి తెలంగాణ ప్రతినిధి గ్రామ పాలన అధికారిని వివరణ అడగగా అక్కడ ప్రభుత్వ భూమి మూడెకరాల 16 గుంటల ఉందని తెలిపారు అట్టి భూమిలో విద్యుత్ ఉపకేంద్రం కంకోల్ సబ్స్టేషన్ మరియు అప్పటి ప్రభుత్వం 2017 లో ముదిరాజ్ సంఘం కు మరియు యాదవుల సంఘం కు కొంతమేర భూమిని ఇవ్వడం జరిగిందని గ్రామస్తులు తెలియజేశారు కానీ అక్కడ ఒక సబ్ స్టేషన్ మాత్రమే ఉన్నది మిగతా భూమి కబ్జాకు గురికావడం జరుగుతుందని గ్రామంలోని కొంతమంది వ్యక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇట్టి ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అధికారులు రెవెన్యూ డిపార్ట్మెంట్ వాళ్లు లంచాలు తీసుకొని కబ్జాలు చేస్తున్న వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకుపోవడం తగదు అన్నారు

# పి.ఆర్.సి ప్రకటించి, పెండింగ్ బిల్లులు చెల్లించండి

**– టి.ఎస్.ఎం.ఈ.ఎస్.ఏ డిమాండ్**

**– హన్మకొండ జిల్లా అధ్యక్షుడు నన్నె సాహెబ్**



ఇది కథ నిజం న్యూస్

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనరీ లాభాలు గత రెండు సంవత్సరాలుగా పెండింగులో ఉన్నాయని తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (టి.ఎస్.ఎం.ఈ.ఎస్.ఏ) హన్మకొండ జిల్లా అధ్యక్షుడు నన్నె సాహెబ్ ఆందోళన వ్యక్తం చేశారు. వారు పేర్కొన్నదేమిటంటే, సరెండర్ లీవ్, జీపీఫ్, టీ.ఎస్.జి.ఎల్.ఐ. వంటి బకాయిలు రెండు సంవత్సరాలుగా విడుదల కాలేదని, దీనివల్ల పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఉద్యోగులను ఆదుకోవాలంటే పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి, డి.ఏ లు మంజూరు చేసి, కొత్త పి.ఆర్.సి ను ప్రకటించి అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్ ఖాన్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు.



ఇది కథ నిజం న్యూస్

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు...కెసిఆర్ పాలనలో రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సకాలంలో వారికి డబ్బులు జమ చేసే విధంగా కృషి చేశారని గుర్తు చేశారు... కాంగ్రెస్ పాలనలో రైతుల ఇబ్బందులు వర్ణాతీతం అని, కాంగ్రెస్ పాలనలో రైతులు సంతోషంగా లేరని అన్నారు. ..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు...

# 4న ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

ఇది కథ నిజం న్యూస్



తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో hb%ఈనెల 4న ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా మహిళ, పురుషుల జట్లు 7న పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. వివరాలకు 9963770406, 95538 10943 సంప్రదించాలన్నారు.